శ్రీ నందిని సిధారెడ్డి

# బతికిన చావు

"అయ్యా...

అయ్యా, అయ్యా...

అయ్యా, అయ్యా, అయ్యా..."

పిలుపులు !

ఆకాశం చిల్లులుపడి కురుస్తున్నట్టు — ఒకటే పిలుపులు !

ఆ పిలుపుల్లో ఆదుర్దా వుంది. తత్తరపాటు వుంది.

తమ కష్టాన్ని ఏదో మేసిపోతున్నట్టు —

నోటి దగ్గరి ముద్ద ఎవరో దోచుకుపోతున్నట్టు —

పిలుపులు! పిలుపులు! ఒకటేపిలుపులు! ప్రకృతేనోరైనట్టు—

నర్సింలు చెవుల్లో పిలుపుల రాళ్లవాన

కాలవ నీళ్లకు నోచుకోని ఎకరం పొలం నర్సింలుది.

'తాయ్ బంద్'లో పాలు పంచుకునేంత డబ్బుగానీ, ధైర్యంగనీ లేని నర్సింలుకు ఊరి చెరువు నీళ్లురావు. ఆ నీళ్ల (నర్సింలు వంతువి) దొర పొలాని కెళతాయ్.

మరి, నర్సింలు పొలం ?

నర్సింలు కాలవలోంచి గూడేసుకోవాలి తన పొలానికి —

తనతో గూడేసి, గూడేసి కండలన్నీ కరిగిపోయిన నర్సింలు భార్య ఓ రోజున 'పాడే'సుకుని వెళ్లిపోయింది.

ఇప్పుడు —

కూతురు లచ్మి ఒక వంక. నర్సింలు ఒక వంక తాళ్లు పట్టుకుని తట్టతో గూడేస్తున్నవేళ —

చెవుల్లో పిలుపుల రాళ్ల వాన —

నర్సింలు 'గూడ' ఆపేసి గడ్డెక్కి చూశాడు.

కొడుకు సెంద్రిగాడు అరుస్తో పరుగెత్తుకొస్తున్నాడు.

"అయ్యా . వాయ్యా... మన వొరిసేనంత పాడయిపోతంది. ఎవ్వల్దో ఎద్దొచ్చి సేను మేత్తంది... రాంద్రే..."

పరుగులోనే చెప్పేసాడు.

నర్సింలు చేతులు పిసుక్కుంటూ దుడ్డుకర్ర తీసుకుని చేను వైపు పరుగు తీశాడు.

నర్సింలు వెనకాల సెంద్రిగాడు —

సెంద్రిగాని వెనకాల లచ్మి —

పరుగు ... పరుగు ... పరుగు

బలిసిన ఎద్దే !

చేను మేసేస్తుంది. సెంద్రిగాడి మనసు రేగిపోతుంది.

నర్సింలు మాత్రం చేతులో 'కర్ర' కింద పడేసి, ఎద్దునే మాత్రం పట్టించుకో నిష్టం లేనట్టు వెనక్కి మరలాడు.

లచ్మి మరలింది అయ్య వెనకాల్నే—

సెంద్రిగాడి కిదేంటో అసలే అర్థం కాలేదు.

"ఏందే అయ్య...ఎద్దు నేమనకుంటనే వొత్తన్నవ్ ?"

"అదెవల్దో ఎర్కేనా ? దొరవార్ది"

సెంద్రిగాడి కింకా అర్థంకాక చూస్తున్నట్టుండిపోయాడు.

'అయ్య, అక్క ఇద్దరు ఎల్లిపోయారు.

హృదయంలో వరి కర్రలు—మేయబడుతున్న వరి కర్రలు—

ఆ కర్రలే చెట్లై లేస్తున్నట్లు......'

సెంద్రిగాని పండ్లు కీర్రు మన్నాయి.

అయ్య పడేసిపోయిన దుడ్డుకర్రను సెంద్రిగాడుతీసుకున్నాడు.

కళ్లు వంట పొయ్యిలయినట్లు —

మేస్తున్న ఎద్దుమీది కురికాడు సెంద్రిగాడు.

* * *

"అయ్యా...

అయ్యా; అయ్యాయ్యా ...

అయ్యాయ్యాయ్యాయ్యాయ్యా .."

పిలుపులు ! అవే పిలుపులు !

చెట్లన్నీ గొడ్డలి దెబ్బల కింద పడి ఏడుస్తున్నట్టు —

ఒకటే పిలుపులు !

ఆ పిలుపుల్లో ఆదుర్దా కాదు, బాధ వుంది. తత్తరపాటు కాదు, ఏడుపు వుంది.

చీమల్ని చెప్పు కాళ్లతో నలిపేస్తున్నట్లు —

వుండు జీవితాల్ని గుండుసూదుల్తో పొడుస్తున్నట్లు —

పిలుపులు! పిలుపులు! ఒకటే పిలుపులు!

నర్సింలు చెవుల్లో రాళ్లవాన !

గూడేయటం ఆపి గడ్డెక్కి చూశాడు నర్సింలు !

'తన కొడుక్కు...తన సెంద్రిగాడు...ఏడ్చుకుంట...

ఎవరు? కొడుతున్న దెవరు ఎవరెవరెవరు?...దొర !!

తన సెంద్రిగాడ్ని దొర వారుగట్టెతో కొడుతున్నాడు.

ఊరుకుంటే సెంద్రిగాడు సచ్చిపోతాడు.'

ఏంచేయాలో అర్థం కాలేదు నర్సింలుకి —

'దొరనెదిరించటం' 'ఉహూ .'

దొర ముందు ఒక్క మాటయినా మాట్లాడలేని తను 'ఉహూ, లాభం లేదు ..తనెళ్లి అడిగితే...తనని కూడా తంతాడు. అబ్బో...ఎట్ల...ఎట్లా...ఎట్లెట్లెట్లెట్లట్ల ?????

ఏంచేయాలో తోచట్లేదు నర్సింలుకింకా —

"నా తమ్ముణ్ని సంపేత్తండ్రు అయ్యో రాండ్రయ్యో నా తమ్ముడు ... నా సెంద్రి డ్ని .. రాండ్రి తండ్రో .. ఉర్కి రాండయ్యో" లచ్మి ఒనువంతా నోరైనట్లు అరుస్తుంది.

చుట్టుపక్కల వాళ్లంతా ఓ ఇరవై మంది దాకా పరిగెత్తుకొచ్చారు. చూశారు.

నర్సింలుని రెచ్చగొట్టి మనిషో కర్ర అందుకున్నారు.

పెద్దగా ఏవో కేకలేసుకుంటూ దొరమీది కురికారు.

దొర గుండుమీదకూచున్న ఇద్దరు 'రౌడీ'లకు సైగచేశాడు. ఇద్దరూ గుండుల్లాగే వున్నారు.

నర్సింలు కర్ర లేపనే లేదు.

'తన కొడుకునే కాదు, తనని కూడా కొడతారు.

దొర పగబడితే తనని ఆ ఊర్లో బతకనిస్తాడా ?

కొడుక్కోసం...దొరని ఎదిరించి ...

రెండు వంద లెకురాల పొలాన్ని ఎకురంనర పొలం ఎదిరించి బతుకుతుందా...ఆ దెబ్బలు తను భరించగలడా...అయ్యో...'

తన చిన్నప్పుడు దొర తండ్రి కొట్టిన దెబ్బలు గుర్తొచ్చాయి నర్సింలుకి.

మిగతా వాళ్ల కర్రలకి భయపడి దొర పరిగెత్తాడు.

ఆ కర్రలు- రౌడీల కత్తులకి భయపడుతున్నాయి.

ఆ కత్తులు—వాళ్ల రెచ్చిన కర్రలకి భయపడుతున్నాయి.

రెండు కత్తుల్లోంచి ఒక కత్తి నర్సింలుని కనిపెట్టింది.

చల్లారిపోయిన కర్ర లాగున్న నర్సింలుని బెదిరిస్తే మిగతా కర్రలన్నీ బెదుర్తాయని ప్లాను వేసుకుంది.

ఒక కత్తిమీద కర్రలు పడుతున్నాయి.

మరో కత్తి నర్సింలుమీద పడింది.

అప్పుడు నర్సింలు కర్ర లేవబోయింది. అప్పటికే—ఆ కత్తి నర్సింలు కర్రని లేవనీయకుండా చేసేసింది.

* * *

'అయ్యా ..

అయ్యా...అ . య్యా . అ య్ . య...ఆ'

అవే పిలుపులు !

మెల్లగా 'కట్లు' కదులుతున్నట్లు—

హాస్పిటల్ బెడ్లు మెల్లగా కిర్రుమంటున్నట్లు -

పిలుపులు స...న్న...గా !

ఆ పిలుపులు రాళ్లవానలాలేవు. కనీసం తుంపరలానూలేవు.

గ్లూకోస్ ఒక్కొక్కచుక్కే రాల్తున్నట్టు-

రోగమొచ్చి హాస్పిటల్ గడియారం మూల్గుతున్నట్టు—

పిలుపులు !

ఎవరూ పట్టించుకోలేదు.

వినడానికి అయ్యలేడు.

చెట్‌పట్‌న నర్సొచ్చి సెంద్రిగాడ్ని తిట్టుకుంటూ వెళ్లిపోయింది.

ఆ తర్వాత కళ్లు తెరచేసరికి అక్క తల నిమురుతోంది.

"ఏందిరా సెంద్రీ?"

"అయ్యేడీ"

లచ్మి నోరు మూసుకుంది.

సెంద్రిగాడు మాత్రం నోరుమూసుకోలేదు.

లచ్మే తప్పనిసరై నోరు విప్పాల్సి వచ్చింది.

''అయ్య.. అయ్య మన కండ్లల్ల మన్నుకొట్టి పొయిండు. కత్తిదెబ్బలు శాన వడ్డయ్. దావ్‌ఖాన రాకముందే జీవిబొయింది.''

ఇద్దరూ బిగ్గరగా ఏడ్వబోయి బిగబట్టుకున్నారు.

''పంచ్‌నామా సేస్తమని పోలీసోళ్లు పీన్గ తీస్కపొయింద్రు.''

ఈసారి లచ్మికి ఏడుపొగలేదు.

పైన తిరగటంకోసం పెట్టిన హాస్పిటల్ 'ఫ్యాన్' తిరగటం లేదు.

సెంద్రిగాడి కళ్లు తిరుగుతున్నాయి.

అంతకన్నా స్పీడుగా మెదడు తిరుగుతోంది.

మాట రాలేదు. లేవబోయి పడిపోయాడు.

*　　*　　*

''అయ్యా...

అయ్యలూ...అమ్మలూ...

అయ్యలమ్మలయ్యలూ...అయ్యా... అక్కలన్నలయ్యలూ ... అయ్యా''

అవే పిలుపులు !

పదహారేళ్లు నిండి పూస్తున్నట్లు—

గుండె గట్టి చేసుకుని తుపాకీ గుండ్లవుతున్నట్లు—

ఒకటే పిలుపులు! ధన్ ధన్ ధనా ధనా ధనా ధన్ ధన్ ధన్...

ఆ పిలుపుల్లో-ధైర్యముంది. ఆక్రోశముంది. తిరుగుబాటు ఉంది. సందేశం వుంది-దేశం వుంది.

సెంద్రిగాడు బుద్ధులు పుస్తకాల్లో చదవలేదు. జీవితాల్లో చదువుకున్నాడు.

సెంద్రిగాడు జనాన్ని పోగుచేసి చెపుతూ పోతున్నాడు.

దొర కళ్లకింద బతకలేక ఉరిపోసుకున్న 'బాలి'కథ చెప్పాడు.

'తాయ్‌బందీ' దొరకూ పటేలుకూ మధ్య జరిగిన కొట్లాటలో 'బలి' అయిపోయిన సాయిమల్లని కథ చెప్పాడు.

తన తండ్రి కథ చెప్పాడు. తాగించి చంపబడ్డ, అనుభవించి చంపబడ్డ...చాలామంది కథలు చెప్పకుపోతున్నాడు.

సెంద్రిగాడు చెపుతూ చెపుతూ........

ఎండకాలం ! !

దొర ఉక్కపోత భరించలేక కిటికీ తెరిచాడు.

ఎండ మండిపోతుంది.

వడ పరుగెత్తికొచ్చి మీదపడింది.

జనం ఎండకన్నా తీవ్రంగా వుంది—

కేకలు వడకన్నా ఉధృతంగా పరుగెత్తుకొస్తున్నాయ్—

గుమిగూడిన జనం...

ఇళ్లు మండి పోతున్నట్టు ఎండ !

జనం మంటలై వస్తున్నట్లు ఎండ !

కర్రలు ..ఎండ...ఎండలో కర్రలు రగుల్తున్న కర్రలై... చుట్టూ చూశాడు దొర.

పిలిచాడు. పిలిచాడు. అరిచాడు. అరిచాడు. గర్జించాడు.

ఎవరూ రాలేదు.

పెళ్లాన్ని పిలిచాడు. పేర్లుపెట్టి రాడీల్నిద్దర్నీ పిలిచాడు.

ఎవరూ రాలేదు. కనీసం జవాబన్నా రాలేదు. దూరంగా గజుల చప్పుడుతప్ప — పిలిచి అరిచినా, అరిచి గర్జించినా... నిశ్శబ్దం ! ! జనాల అడుగులు—కర్రల అరుపులు—అడుగులు అరుపులు—బయటికిపోతే చావే ఖాయం—ఇంట్లో—ఆ ఇంట్లోనే—ఎక్కడో దాక్కోవాలి—ఎక్కడ—ఎక్కడ దాక్కునేదీ—ఎక్కడెక్కడ ..అటు—ఇటు—అటిటెటు—ఎటు - ఎటెటు—ఎక్కడెక్కడెటెటెటెటు ... అయ్యో...అయ్యో...అయ్యయ్యయ్యయ్యో టెటెటెటు.........

పెరట్లో చేద బావి పిలిచినట్లనిపించింది.

